# ఆనంద ధ్వని

## డా. మాదిరాజు రంగారావు

[అరవిందుల—మహాకావ్యం సావిత్రి చదివిన తరువాత పొందిన మానసికమైన అనుభూతిని చిత్రించే కృతి.]

### 1

ఈ క్షణం మేల్కొంది
కాంతి బిందువై,
సాగింది రేఖలుగా
కరిగిస్తూ తమో రాశి.

కల్పన వాస్తవమైంది.
స్థావరం జంగమమైంది.
శూన్యం సంభృతమైంది.
కాలం తెలివి పొందింది.

ఇంతవరకూ అననుభూతంగా
ఉందని మనోజ్ఞ రూపం
హిరణ్య గర్భం నుండి
ఓంకారం వలె
ఆవిర్భూతమైంది ఈ క్షణం
ఆత్మకు ఇస్తూ ఆనందాకృతి.

లౌకిక వనమంతా ఇపుడు
చివురించింది క్రొత్త తెలివి
సూర్యకిరణ పంక్తుల్లో
ప్రకాశమాన కళ వలె.

అలలో కన్పించే కదలికలో
కలలో దాగిన వాస్తవంలో
కన్పిస్తోంది—చంద్రకళ
ఏ శిరోలంకారమో ?

ఇది మాయ కాదు
మృగతృష్ణ కాదు,
విస్పష్టమైన అనుభవ దర్పణం
ఆత్మను బింబించే క్షణం.

చీకటి కలసిపోతూంది
వెలుగులో తహతహతో
రూపు మాపుకొనే ఆశలో
అగ్నిని గుర్తిస్తూ తెలివిలో.

### 2

క్షణాలు గడుస్తున్నాయి
రెక్కలు సాగినింగిలో
కదలిపోయే మబ్బుల వలె.

జీవిత చక్రనేమి క్రమణ వేగానికి
ఎగసి క్రమ్మిన దుమ్ము అణగి
వెలుగుతూంది ఆత్మతేజం.

నిద్రా గుహనుండి
బయటికి వచ్చిన మనస్సు
బ్రతుకుకై అన్వేషణలో
పొందిన అశాంతి వలయం,
చెరగిపోతూంది
ఎక్కడిదక్కడ ఈ క్షణం.

దివ్యనుండి వెలుగు
వేరయి పోయే లోపల
దిక్కులు వెడల్పు చేయుటాకే,
ధూమ వదనం వివర్ణమౌతూంది.

అహంకారం దూకుతూంది సముద్రంలో.
మహాభయం కలుస్తూంది గాలిలో.

మొక్కకు కావాలి
వెలుగూ, నీరూ—
మెలకువకు కావాలి
అనుభవం, వివేకం,

జీవితంలో కన్పించే
సురాసుర శక్తుల సంఘర్షణ
కావాలి ప్రాణభయంనుండి
జీవిత సత్యానికి మార్గం
ద్వైతాభిముఖంగా సాగే పథంలోని
మానసిక సుందర శిల్పాలే దేవతలు!

ఇక్కడ ఎక్కడ ఉంది
వివిధ వస్తు విభేదం!